
కథలు

# తక్కువేమి మనకూ...

కథానికా సంపుటి

టి. శ్రీవల్లీ రాధిక

**ప్రమథ ప్రచురణలు**
హైదరాబాదు

# THAKKUVEMI MANAKU...

A Collection of Short Stories
by **T. Srivalli Radhika**

© T. Srivalli Radhika

*First Edition* : 2012

*Price* : ₹ **90/-**

*For Copies* :
**T. Srivalli Radhika**
5-4-345, Road No. 5
Kamala Nagar, Vanasthalipuram,
Hyderabad - 500 070
Ph : 040 - 2412 4124
E-mail: valli.radhika@gmail.com
**&**

**All leading Book shops**

*Cover Design* :
**Bapu**

*Book Production* :
**T. Muralidhar Gowd**
9393 176 552

*DTP* :
**Balaji Graphics**
Hyderabad

*Published by* :
**Pramatha Prachuranalu**
Hyderabad - 500 070

*Printed at :*
**Karshak Art Printers**
(*Multicolour Printers & Designers*)
40-APHB, Vidyanagar, Hyderabad - 500 044
Ph : 040-2761 8261

# కథానికాకల్పవల్లిక సుమా, ఈ రాధిక!

ఈ సౌభాగ్యవతి పేరుతో, కథానికలతో ఇంచుమించు పదేళ్ళనుంచి పరిచయం ఉందనుకుంటాను. ఈమె కథానికలన్నీ చదివానని చెప్పలేను కాని, చదివిన ఏ కథానికా నన్ను నిరాశపరచలేదని చెప్పగలను. ఇది మొదట చెప్పవలసింది; మొహమాటపడి చెప్పేవాళ్ళ మాట కాదు! కాకపోగా, 'రాస్తే ఇలాటి విషయాన్ని ఎంచుకోవాలి; ఇలాటి విధానంలో కథ నడపాలి; ఈ విధంగా కథ ముగించాలి,' అనిపించేటట్టు – అని అందరికీ చెప్పాలనిపించేటట్టు – ఉండటం ఏ రచయితకయినా ప్రతిష్ఠాకరమే. ఆ ప్రతిష్ఠ ఈ రచయిత్రికి ఇప్పటికే వచ్చిందన్నది తాత్పర్యం. అందుకు రుజువుకోసం వెనకవాటికి వెళ్ళనక్కరలేదు. ఈ సంపుటంలోవీ ప్రశంసాపాత్రమయినవే! వీటి తరవాత వెనకవాటిని తప్పకుండా చదువుతారు.

'తక్కువేమి మనకూ...' అన్న కథానిక, 'జాగృతి' పత్రికవారు, 'స్వర్గీయ శ్రీ వాకాటి పాండురంగరావు' స్మారకార్థంగా నిర్వహించిన దీపావళి పోటీలో ప్రథమ బహుమతి (రూ.10 వేలు) అందుకొన్నది. మరో పదకొండు కథానికలను కూడా కూర్చి తీర్చిన ఈ సంపుటానికి ఈ కథానిక పేరే పెట్టడం చాలా బాగుంది. మంత్ర బీజాక్షరాల్లాటి ఈ మాటలు భద్రాద్రి రామదాసు కీర్తనను గుర్తుకు తెస్తాయి కదా!

ఈ సంపుటంలో మొదటిది 'గురుత్వం'. క్రమబద్ధమయిన జీవితానికీ ఆరోగ్య ప్రదమయిన అలవాట్లకూ కట్టుబడే వ్యక్తి సుఖశాంతులను పొందుతాడనీ సునిశిత ప్రజ్ఞా వంతుడూ పురోగామీ స్ఫూర్తిప్రదాతా అవుతాడనీ తెలుపుతుంది ఇది. ఆ వ్యక్తి, పక్కింటి శర్మగారు కావచ్చు; ప్రతీకాత్మకంగా – వారి దొడ్లో జామచెట్టు కావచ్చు. ఆ స్ఫూర్తితో ఏర్పరుచుకొన్న కార్యవిధానంవల్ల, 'దివ్య' అనే రమణీమణి భర్త కార్యశూరుడనీ అనిపించు కొంటాడు, తృప్తీ పొందుతాడు. అన్ని రంగాల్లోనూ మనిషినీ ఉద్యోగసోపానాలనూ జీవన విధానలయనూ అతని విలువలనూ దృష్టికోణాన్నీ మంచిచెడ్డలనూ కుదిపిపారేస్తున్న, ఇప్పటి, ఈ పోటీ ప్రపంచానికి హితోపదేశం చేసే కథానిక ఇది.

"భార్యాభర్తల మధ్య ముఖ్యంగా ఉండవలసింది సహకారం. అందుకోసమే పెళ్ళి. అలా సహకరించుకునే ఉద్దేశ్యమే లేకపోతే పెళ్ళి అవసరమే లేదు," అంటుంది 'సహధర్మ చారిణి' కథానికలో పూర్ణ – వాళ్ళ అన్నయ్యతో.

"భార్యాభర్తలుగా మీరిద్దరూ ఒకరితో ఒకరు సహకరించుకుంటున్న విషయాలే కనబడట్లేదన్నయ్యా, నాకు..." అని స్పష్టం చేయడమే కాక, "నీ పనులన్నీ తనచేత చేయించకపోవడం తనని సుఖపెట్టడమయితే కావచ్చు. కానీ ఇద్దరూ కలిసి కొన్ని పనులు చేయడం సాహచర్యం... దానివల్ల బంధం బలపడుతుంది," అని కూడా బోధిస్తుంది. "శీలమూ ధర్మమూ ఒకటేనంటావా?" అన్న అన్నయ్య ప్రశ్నకు ఆమె నవ్వుతూ ఇచ్చే సమాధానం, "నువు వేరనుకుంటున్నావా?" అన్న ఎదురుప్రశ్నే. చెల్లెలి మాటలు అన్నను ఆలోచింపజేశాయి. ఆత్మవిమర్శకు ప్రేరేపించాయి. దానివల్ల అతనిలో వచ్చిన మార్పు, భార్య శైలజ కళ్ళను మెరిపింపజేసింది.

"అడిగిన ప్రతిదానికీ కారణం చెప్పి... విజ్ఞానాన్ని అందించడమే కాదు... ఇక మీదట పిల్లలకి శ్రద్ధని నేర్పడంమీద కూడా శ్రద్ధపెట్టాలి," అనుకొంటుంది శారద, 'శ్రద్ధ' కథానిక ముగింపులో. అలా అనుకోడానికి కారణం, ఆమె మాటల్లోనే ఇలా చెప్పుకోవచ్చు: "పిల్లలకి ప్రశ్నలడగడం మాత్రమే నేర్పుతున్నాం. సమాధానపడడం నేర్పడం లేదు. నిప్పుతో సవాలక్ష ఉపయోగాలు ఉండవచ్చు. కానీ నిప్పును రగల్చడం నేర్పితే సరిపోదు. ఏం చేస్తే నిప్పు బాగా మండుతుందో నేర్పినట్లే (ఆ పని రాజకీయవృత్తి పనివాళ్ళు చేస్తూంటారు).. నిప్పును చల్లార్చడమూ నేర్పాలి. నిప్పుమీద నీరు జల్లడమూ నేర్పాలి. నిజానికి మొదటిదాన్ని మనం ప్రత్యేకించి నేర్పకపోయినా అవసరమే వాళ్ళకి దాన్ని నేర్పుతుంది. కానీ రెండోదాన్ని మాత్రం మనం పద్ధతిగా నేర్పి తీరాలి," అన్న నిష్కర్ష కనిపిస్తుంది. "తప్పకుండా చేయాల్సిన పనులంటూ కొన్నిటిని నిర్దేశించుకుని వాటిని క్రమం తప్పకుండా అందరూ శ్రద్ధగా పాటించడం... అదంతా (పూర్వకాలంలో) అసలు ఎలా సాధ్యం అయిందా అని ఆలోచిస్తున్నాను. ఇప్పుడు ఎందుకని అలా చేయలేకపోతున్నాం! కారణమేమిటి?" అన్న వందన ప్రశ్నకు శారద సమాధానం – "స్వార్థం పెరగడం, విశ్వాసం సడలడం". అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్టు లేదూ?

ఈ రచయిత్రి ఆకాశవాణిలో వినిపించిన కథానిక పేరు 'సత్యం'. పక్కన దక్షిణం వైపు ఇంటివాళ్ళ పనిమనిషీ ఉత్తరంవైపు స్కూలు విద్యార్థి తల్లీ పడవలసి వస్తున్న వాళ్ళ వాళ్ళ యజమానురాళ్ళ ఈసడింపులకు వెనకనున్న సత్యాన్ని తెలివిడిచేసే వృత్తాంతమిది. 'ఇది ఇలా ఉన్నప్పుడు అది అలా ఎలా ఉంటుంది?" అనుకొనే వ్యక్తికి 'ఇది ఇలా ఉంది కాబట్టే అది అలా ఉంటుంది' అన్న సత్తెమ్మ మాటలు కొత్తకోణాన్ని చూపించాయి. "నిజానికి రెండు సత్యాలు లేవు. రెండు సిద్ధాంతాలకీ ఘర్షణ లేదు. ఒకే సత్యాన్ని తర్కం రెండుగా భ్రమింపజేస్తోంది," అనిపించింది. "అవతలివారిని (వాళ్ళ అభిప్రాయాన్ని) ఒప్పుకోలేకపోవడానికి కారణం, వారి సత్యం విభిన్నమవడం కాదు. మనల్ని భయమో,

శోకమో కమ్ముకోడం". ఈ కథారచయిత్రిలో తాత్త్వికచింతనాపరురాలు లేదని ఎవరన గలరు?

"...మొదలుపెట్టిన పనిని పూర్తిచేసేందుకు... నేను ధర్మం అనుకున్నదానివైపు నిలబడేందుకు బయల్దేరుతూంటే... 'ఎవరి కర్మ వాళ్ళే అనుభవించాలి' అన్న కిరణ్ (మహిళా సంరక్షణ కేంద్ర నిర్వాహకురాలి కొడుకు) గుర్తొచ్చి ఆమె (తల్లి) పెదవులపై చిరునవ్వు మెరిసింది, 'ఎంపిక'లో.

'లోభం' కథానికలో శ్రీగౌరి, టైమే మనీ అని గ్రహించలేనివాళ్ళనీ టైమును మనీగా మార్చుకోలేనివాళ్ళనీ చూసి జాలి పడుతుంది. ఎవరికోసమూ తన సమయాన్ని ఖర్చు పెట్టకపోవడాన్ని లోభగుణంగా గుర్తించింది వాణి – "ఎవరికీ ఇవ్వకుండా దాచుకున్నదేదీ మనకీ మిగలదు," అంది. "నిజమే, డబ్బేకాదు, డబ్బుగా భావించి కూడబెట్టిన దేనినీ కట్టుకుపోలేం," అనుకుంది కథకురాలు.

పదివేల పురస్కారమందుకొన్న కథానిక (తక్కువేమి మనకూ...)లో, 'నిత్య' అనే పెళ్ళికూతురి పాత్రను ఎంతో విశిష్టంగా చూపించారు రచయిత్రి. ఏమిటి ఆమె ప్రత్యేకత లంటారా – చూడండి – "జీవించినంతకాలం నాచుట్టూ ఉన్నవారికి స్ఫూర్తినివ్వాలి. నేను మరణించినప్పుడు నా స్నేహితులంతా ఓ కొత్త నక్షత్రంకోసం అప్రయత్నంగా ఆకాశం వైపు చూడాలి," అని చెప్పింది, ఒక సందర్భంలో, తనను తాను పరిచయం చేసుకొంటూ.

"ఉద్యోగం నుంచి మీరు ముఖ్యంగా ఆశించేవి ఏమిటంటే, 'డబ్బు' అనే మాట దగ్గర టిక్కుపెట్టింది."

'డిసెంబర్ 31 తేదీ సంబరంలో పదినిమిషాలసేపు నాట్యం చేసే అమ్మాయికి రెండు లక్షలు ఇస్తారట,' అన్న సమాచారం మీద కొందరమ్మాయిలు చేస్తున్న వ్యాఖ్యలను విన్నారు నిత్యా, ఆమెకు కాబోయే మామగారూను. "చెప్పు, ఎంత తీసుకుంటే అవమానం కాదు, గౌరవం అనిపించుకుంటుంది?... నువ్వయితే ఏమంటావ్?" అని సూటిగా ప్రశ్నించారు ఆయన. "నేనా!" అంటూ నవ్వింది ఆమె. "నేనయితే రెండు లక్షలు కాదు. కోట్లు గుమ్మరించినా అలా డాన్స్ చేయను అంటాను," అంది నిత్య. ఆ మాటకు ఉలిక్కి పడ్డారాయన. ఆ అమ్మాయి ఆణిముత్యం అని గ్రహించారు. అంతకంటె కావలసిందేముంది?

మరో కథానిక 'ఎల్లల నడుమ'. ఇందులో వస్తువు 'అసంతృప్తి'. అది ఎన్నెన్ని రకాలో! దానికి మూలాలు ఎన్నెన్ని రకాలో! "అసౌకర్యం... అభద్రత... నోస్టాల్జియా... యూనిఫామ్... మన టేస్ట్... మన సౌకర్యం... అన్నీ టు బిహేవ్‌కె లే! సమస్య యూనిఫార్మిటీ, అందర్నీ ఓ మూసలోకి లాగేస్తున్న యూనిఫార్మిటీ... అసంతృప్తికి మూల

కారణం అసమానత కాదు, సమానత. ఏ చిన్న వైరుధ్యమూ లేకుండా ఎటుచూసినా ఒకేలా ఉన్న సమానత." మనుషులందరి మనసులూ ఇరుకిరుకు గదులపెట్టెలయి పోతున్నాయి కదా మరి!

'శ్రీమాత్రే నమః' – శ్రీమహారాజ్ఞికి తగ్గట్టుగా ఎంత చక్కటి పేరు! ఈ సంపుటంలో ఉన్న గొప్ప కథానికల్లో ఇదొకటి కదా! "ప్రేమా, స్నేహమూ కాదు, మీకు మేం ఉన్నాం అన్న నమ్మకాన్ని ఇవ్వాలి తల్లిదండ్రులు, పిల్లలకి," అంటాడు శ్రీధర్, కథలో. "దేవుడిపట్ల నమ్మకమూ, భక్తీ నేర్పగలిగితే చాలు... మిగతావన్నీ ఇచ్చినట్లే," అంటుంది అతని వదినగారు.

"అమ్మ ఉన్నా లేకపోయినా అమ్మవారు మాత్రం ఎప్పుడూ మన దగ్గరే ఉంటారని వాడికి తెలుసు; అమ్మ వాడికి నేర్పించింది," అంటుంది ధాత్రి అనే చిన్నపిల్ల, శ్రీధరుకు అన్న కూతురు, తన తమ్ముడి విషయంలో.

ముగింపు ముందటి పేరాలో, పాత్ర మనసులో ఉన్న మాటను ఇలా చెప్పారు శ్రీవల్లీ రాధిక : "ఒక అమ్మ తన పిల్లల ఉద్వేగాలకి సరిపడినంత ప్రేమని వాళ్ళకి ఇవ్వలేక పోవచ్చు. ఎదిగిన తరవాత కూడా వాళ్ళని సంతృప్తిపరచగలిగిన సలహాలు చెప్పలేకపోవచ్చు. వాళ్ళతో ఎప్పటికీ ఉండిపోగలనన్న నమ్మకాన్ని కలిగించలేకపోవచ్చు. కానీ ఇవన్నీ చేయగల అమ్మ (అమ్మలగన్నయమ్మ) ఒకతె ఉందని వాళ్ళకి చెప్పగలదు. ఆ అమ్మని వాళ్ళకి పరిచయం చేయగలదు. ఆ అమ్మపై వాళ్ళకి ప్రేమ ఏర్పడేలా ట్రెయిన్ చేయగలదు." గొప్ప శాశ్వతసత్యాన్ని ఎంత సరళంగా చెప్పారో ఈ రచయిత్రి!

"చేతకానిదానిలా మనసుకు నచ్చనిదాన్ని భరిస్తూ కూర్చోవాల్సిన అవసరం కనబళ్ళేదు నాకు," అంటూ జయంతి అనుకోడంతో మొదలయింది, 'విముక్తి' కథానిక. తనవన్నీ కళాకళలనీ మనసు ఏం కోరితే అది చేస్తాననీ తనకు తెలుసు. ఆ చిరాకును తరచుగా బయలుపరుస్తూనూ ఉంటుంది. అటువంటి జయంతికి, తన సహోద్యోగిని అయిన ప్రియకున్న శాంతస్వభావం, ఆమె చెప్పే హితవచనాలూ చూపించే యుక్తాయుక్త వివేకమూ క్రమక్రమంగా అర్థమవుతూ వచ్చాయి; ఆలోచింపజేశాయి. "ఆఫ్టరాల్, అది నా మనసు. నేను చెప్పినట్లు వినడం దానికి మంచిది కానీ దానికి నచ్చినట్లు చేయడం నాకు కాదు," అని తల్లికి చెప్పే స్థితి వరకు ఆమె మారింది. అమెరికా వెళ్ళి ఏడాది పనిచేసి మెప్పులూ గొప్పలూ పొందేకంటె కడుపుపంటను కాపాడుకోడమే మేలని తలచింది. ఆ విధంగా, మనసుపెట్టే ప్రలోభాల నిర్బంధంలో నుంచి బయటపడగలిగింది జయంతి.

"ప్రాణం పోవడం, ఆగడం మన చేతుల్లో ఉందా? ప్రారబ్ధం ప్రకారం జరుగుతుంది," అన్న మామయ్య మాటలు పెద్దమేనల్లుడికి నచ్చకపోవచ్చు – (అతగాడు

పెద్ద చదువులు చదివి అమెరికాలో బోలెడు సంపాదిస్తూ, కుతర్కమూ నాస్తికతా ఒంట బట్టించుకొన్నవాడు కాబట్టి). కాని ఈ గడ్డమీద పుట్టినందుకు, ఇక్కడి సంస్కృతికి వారసులయినందుకు ఆనందించేవాళ్ళందరికీ ఇది నచ్చింది. భర్త చనిపోయిన తరవాత తనను పెద్దకొడుకు అమెరికా తీసుకువెళ్తానన్నప్పటికీ తల్లి ఒప్పుకోలేదు. ఇంతవరకు తల్లిదండ్రుల్ని కంటికిరెప్పలా చూసుకొన్నవాడూ ఆత్మీయతాబంధాన్ని పెంచుకొన్నవాడూ సత్యం; ఆమె చిన్నకొడుకు. "నేను సత్యం దగ్గరే ఉంటాను," అని ఆమె అన్నమాటల్లో అంతరార్థం పెద్దకొడుక్కు ఏం తెలుస్తుంది?

చివరి కథ 'సౌందర్యం'. చిత్ర, గాయత్రి సహాధ్యాయినులు. వాళ్ళలో చిత్ర మంచి అందకత్తె మాత్రమే కాక, కవనాభిలాష ఉన్నది. ఒకనాడు మనసులో మెదిలిన ఒక భావాన్ని కవితాత్మకంగా ఇలా రాసుకొన్నది, తన నోట్‌బుక్కులో – "అదృష్టం అంటే అసలు అందం అంటే ఏమిటో తెలిసిన వ్యక్తి మనకి ఎదురవడం, ఆనందం అంటే మనల్ని చూసి అతని గుండె ఒక్కక్షణం లయ తప్పిందని మనకి అర్థమవడం." ఆ కవిత చూసి పక్కనున్న గాయత్రి, "ఎంత బాగా రాశావే!" అంది.

కొంతకాలం గడిచింది. ఇద్దరికీ పెళ్ళిళ్ళయాయి. కాపురాలూ పిల్లలూ మామూలే. అప్పుడెప్పుడో కలిగిన భావం మనసులో ఉండిపోయింది కాని పూర్తి కవితారూపాన్ని పొందలేదు. "అనుభవంలోకి రాని భావం కవితగా మారదేమో!" అంది చిత్ర.

ఒకనాడు చిత్ర ఆఫీసులో మీటింగ్ రూములో అడుగుపెడుతూ ఉంటే, ఢిల్లీ నుంచి వచ్చిన హేమంత్ తలెత్తి చూశాడు. "ఇన్నాళ్ళ నిరీక్షణ ఫలించింది! అతని కళ్ళలో తళుక్కుమన్న మెరుపు ఆమెకి స్పష్టంగా కనిపించింది!!" అయినా, మీటింగ్ పూర్తయేసరికి ఆమెకు తలనొప్పి వచ్చింది. ఇంటికి వెళ్తూ ఉండగా గాయత్రి గుర్తుకు వచ్చింది. చిత్ర కారు గాయత్రి ఇంటికి దారి మార్చింది.

"ఏమిటే, అమృతం తాగినంత ఆనందంగా కనిపిస్తున్నావు?" అని చిత్ర అడిగింది, గాయత్రిని. దానికి కారణం చెప్పింది గాయత్రి. సాయంకాలం, పక్కనే ఉన్న శివాలయానికి వెళ్ళిందట. ఆలయ పూజారి చిన్నవాడే; పాతికేళ్ళు కూడా లేవేమో! ఇదివరకటి పూజారిగారిని గురించి అడిగింది. ఆయన, వాళ్ళ నాన్నగారేననీ హఠాత్తుగా పక్షవాతం రావడంవల్ల వారు అర్చకత్వం చెయ్యలేకపోతున్నారనీ చెప్పాడు. అతను ఏదో కంపెనీలో ఉద్యోగం చేసేవాడట. ఆ ఉద్యోగం పోయింది. ఇక్కడ గుడికేమో సరైన పూజారి దొరకలేదు. అందుచేత తానే అర్చకత్వం చేస్తున్నానని చెప్పాడు.

"అమ్మవారు తనకి సేవచేసే భాగ్యం ఇవ్వదలుచుకున్నప్పుడు అలాగే రప్పించు కుంటుంది," అందట గాయత్రి. "అధైర్యపడకు. మీ నాన్నగారికి త్వరగా నయమయి

పోతుందిలే,” అని అభయమిస్తున్న ధోరణిలో చెప్పిందట, అతని కళ్ళు చెమ్మగిల్లాయి. “సాక్షాత్తూ అమ్మవారే వచ్చి చెప్తున్నట్లుగా ఉందండీ నాకు!” అన్నాడట ఆ అబ్బాయి. “ఇందాక... సూర్యాస్తమయపు వెలుగులు మీ తల వెనక ప్రకాశిస్తూండగా... పసుపు రాసుకున్న పాదాలతో మీరు గుడిలోకి అడుగుపెడుతూన్నపుడే నాకెందుకో శరీరం వణికినట్లయింది. ఒక్క క్షణం గుండెలయ తప్పింది. ఇప్పుడు మీరు ఈ మాట చెప్తూంటే అమ్మవారే ధైర్యం చెప్తూన్నట్లుగా ఉంది,” అన్నాడట.

“నిరంతరం ఆ జగన్మాత సౌందర్యాన్ని చూసి మురిసే ఆ అబ్బాయి... అందం అంటే ఏమిటో అందరికన్నా బాగా తెలిసినవాడు... నన్ను చూసి తన గుండెలయ తప్పిందని చెప్తూంటే నాకు ఎంత ఆనందంగా అనిపించిందో చెప్పలేనే! నిజానికి నువు రాసిన ఆ (కవితా) వాక్యాల పూర్తి భావం నాకీరోజే అర్థమయిందనిపించింది,” అంటు న్నప్పుడు గాయత్రి కంఠం వణికింది. “అప్పటి వరకు చిత్తరువులా కూర్చుని ఆమె మాటలు వింటూన్న చిత్ర... ఆమె భుజంపై తల ఆనిస్తూ, “నీకే కాదు. నేను రాసుకున్న ఆ వాక్యాల అసలు అందం నాకూ ఈ రోజే అర్థమయింది,” అనుకుంది.” వీళ్ళిద్దరి స్పందనల సంగతి అలా ఉంచితే చిత్ర అందాన్ని చూసిన హేమంత్ కళ్ళలోకి వచ్చిన మెరుపు వెనక ఉన్న అనుభూతి వేరు. సాయంసంధ్యవేళ ఆలయప్రాంగణంలో అడుగుపెట్టి ఆప్యాయంగా ఓదార్పు పలికిన వ్యక్తి సాక్షాత్తు అమ్మవారేననిపించేటంతగా కలిగిన అనుభూతి వేరు. ఒకటి భౌతికరూప మూలకం; మరొకటి ఆధ్యాత్మిక భావోత్కర్ష మూలకం. ఇంత గొప్ప కథానిక రాసినందుకు శ్రీమతి శ్రీవల్లీరాధిక ప్రత్యేకంగా అభినందనీయురాలు.

ఇందులో కథానికలన్నీ వ్యక్తులనూ, సమాజాన్నీ, పరమార్థాన్నీ అవగాహన చేసుకోడానికీ మానవత్వపు విలువలను ఆదరించడానికీ, పెంచడానికీ చక్కగా ఉపకరించేవి. మంచి సాహిత్యాన్ని కోరేవాళ్ళకు ఇంతకంటె ఏం కావాలి?

చొక్కపు బంగారపు చిక్కని నగిషీ నగలివి! లోలోపల ధరించవలసినవి!

రచయితకు అన్ని విధాలా అభ్యున్నతి కలగాలని కోరుతున్నాను; ఆశంసిస్తున్నాను.

***– పోరంకి దక్షిణామూర్తి***

హైదరాబాదు,
08. 02. 2012.

# నా మాట

ఐయిదు తరాలు చూసిన నూటపాతికేళ్ళ తెలుగు కథ, కాలంతోపాటు అడుగులు ముందుకు వేస్తూ వుంది. ఆ అడుగులలో ఒక పాదముద్రిక శ్రీమతి టి. శ్రీవల్లీరాధిక. ఈమె కథలు ఇప్పటికే పాఠకులని ఆకర్షించాయి. విమర్శకులని ఆహ్వానించాయి.

తెలుగు కథ – కార్డు కథ, ఇన్లాండ్ కథ, ప్రాంతీయ కథ, దళిత కథ, స్త్రీవాద కథ, సీమ కథ, తెలంగాణా కథ, కుటుంబం కథ, రాజకీయ కథ, హాస్య కథ – కాలంతో పాటు ఒక ప్రత్యేకత సంతరించుకుని పాలగుమ్మి పద్మరాజు గారి కలం లాగా అంతర్జాతీయ గుర్తింపు పొందింది.

అఖండ గోదావరిలా ప్రవహిస్తున్న తెలుగు కథ శ్రీవల్లి కలంలో ఒక క్రొత్త ఒరవడి తొక్కింది. ఒకవైపు ఆధునిక కంప్యూటర్ పాత్రలు, కొన్ని సంఘటనలతో, తల్లివేరు అయిన మన సంస్కృతి నుంచి ఇతిహాస సత్యాలూ, జీవిత సత్యాలూ, చెట్టు నుంచీ పుట్ట నుంచీ పాఠాలు నేర్పుతాయి. అవి ఆచరణలో పెట్టి, మనశ్శాంతి పొంది, కంప్యూటర్ చిక్కులని విడదీయగలుగుతున్నారు – అన్నది కొన్ని కథల్లో స్పృశించారు.

కంప్యూటర్ యువతని అన్యాపదేశంగా మన సంస్కృతీ సంపదలని మర్చిపోకండి అని పాత్రల ద్వారా హెచ్చరించడం చాలా బాగుంది.

అంతరిక్షంలోకి పంపిన ఉపగ్రహం కదలికలు నేలమీద వున్న శాస్త్రజ్ఞుని చేతిలో వున్నాయన్నది జ్ఞాపకం చేస్తున్నారు రచయిత్రి.

"తక్కువేమి మనకూ!" కథానికలో శివధనుర్భంగం జరుగుతున్న తరుణంలో, వరమాల పట్టుకుని నిల్చున్న జానకిలా కనిపించిన నిత్య, 'పట్టుకోవలసిన దాన్ని పట్టుకుంటే, భయమూ, దైన్యమూ, అజ్ఞానమూ ఏదీ వుండదు కదండీ!' అని అనటం, జీవనసత్యాన్ని ఒక్కమాటలో వివరించటం రచయిత్రి పరిణతికి అక్షరసాక్ష్యం. ఈ కథకి స్వర్గీయ వాకాటి పాండురంగారావు గారి స్మారక పురస్కారంలో ప్రథమ బహుమతి రావడం ఎంతో సమంజసం. పాండురంగారావు గారి ఆలోచనావిధానం, వారి విలువలూ అంతర్లీనంగా ఈ కథలో యిమిడి వున్నాయి.

"సత్యం" కథలో – "టి.వి. ఆన్ చేయడానికి రిమోట్ ఉంటే, ఆ రిమోటును ఆన్ చేయడానికి మరో మనిషి కావాలి శైలజకి."

"దూరం నుంచి చూసే నీబోటమ్మలు ఆమె ఏ పనీ చేసుకోలేదు కదా! చేసేవాళ్ళని ఎందుకు సతాయిస్తుందా అనుకుంటారు. కానీ ఆమె చేసుకోలేదు కాబట్టే కదమ్మా చేసేవాళ్ళలో తప్పులు కనబడేది. ఆమె కూడా పనిచేయడం మొదలుపెడితే పనిలో కష్టం ఆమెకే తెలిసొచ్చుద్ది కదా!" అన్న పనిమనిషి సత్తెమ్మ వ్యాఖ్య నిరంతర సత్యం.

"శ్రీమాత్రే నమః"లో ప్రేమా, స్నేహమూ కాదు "మీకు మేము వున్నాం" అన్న నమ్మకాన్ని తల్లిదండ్రులు పిల్లలకు యివ్వాలి.

పిల్లలు ఇంకా ఇంకా చదవాలి అనే తాపత్రయం తప్ప వాళ్ళకి మానసిక ధైర్యం, నమ్మకాన్ని యివ్వాలని ఎంతమందికి తెలుసు!

"గురుత్వం" కథలో 'కంట్రోల్ ఉన్న చోట ఎఫిషియెన్సీ వుంటుంది' అంటుంది దివ్య. జామ కొమ్మల నుంచి వేలాడుతూ నోరూరించే కాయల సువాసన, కొమ్మల మీది పిచ్చుకల సవ్వడి, చెట్టు కాండం మీద గంతులేస్తున్న ఉడుతపిల్లా – రచయిత్రికి ప్రకృతిలో లీనమైపోయి, ప్రకృతిలోగల సమతౌల్యాన్ని అనుభవించగల సూక్ష్మదృష్టి వుంది.

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ రచయిత్రి కీర్తి పురస్కారం, ఢిల్లీ కథ సంస్థ అవార్డు – ఇంకా ఎన్నో అవార్డులు పొందిన శ్రీవల్లి తెలుగు పాఠకులకి కొత్త కాదు. మూడు కథాసంపుటాలు, రెండు కవితా సంపుటాలు, రెండు నవలలు, ఒక నవలిక వ్రాసిన ఈమె కంప్యూటర్ ఎలక్ట్రానిక్స్‌లో దిట్ట.

ఈ కంప్యూటర్ యువతి, ప్రాచీన సంస్కృతికి, తాత్వికతకు ఈనాటి కంప్యూటర్ వేగానికి మధ్య ఒక సమన్వయం వెతికి, ఆ సారాన్ని పాఠకులకి అందిస్తున్నారు.

అటువంటి అపురూపమయిన కథలు తక్కువేమి మనకూ! అంటూ ప్రక్కనే వుండి వుత్తేజపరుస్తున్నారు. పన్నెండు కథలూ ఒకటికి రెండు సార్లు చదవండి. చదివి ఆకళింపు చేసుకోండి ఈ యువతరం రచయిత్రిని.

**– మాలతీచందూర్**

చెన్నై,
27.01.2012.

# కథాక్రమం

| | | |
|---|---|---|
| 1. | గురుత్వం | 1 |
| 2. | సహధర్మచారిణి | 9 |
| 3. | శ్రద్ధ | 23 |
| 4. | సత్యం | 30 |
| 5. | ఎంపిక | 36 |
| 6. | లోభం | 45 |
| 7. | తక్కువేమి మనకూ...! | 55 |
| 8. | ఎల్లల నడుమ | 63 |
| 9. | శ్రీమాత్రే నమః | 73 |
| 10. | విముక్తి | 80 |
| 11. | సత్యానికి చేరువగా | 94 |
| 12. | సౌందర్యం | 105 |



# 1. గురుత్వం

పక్కింట్లోంచి హారతిగంట వినిపించడంతో రోజులాగే మెలకువ వచ్చింది. తలతిప్పి గడియారం వైపు చూశాను. అయిదూయాభై. చిరాకుగా దుప్పటి మెడవరకూ లాక్కున్నాను.

ఇక నిద్రపట్టదు. రాత్రి పడుకునేసరికి పన్నెండయ్యింది. ప్రక్కింటి సుబ్రహ్మణ్యశర్మ గారి పుణ్యమా అని ఇలా రోజుకి ఆరుగంటలు కూడా నిద్రపోయే అవకాశం లేకుండా పోతోంది.

మొదట్లో అది పూజగంటలా వినిపించే ఓ కొత్తరకం అలారమేమో అనుకునేవాడిని.. కానీ తర్వాత తెలిసింది ఆ భార్యాభర్తలిద్దరూ నాలుగింటికే నిద్రలేస్తారని. సూర్యోదయానికి ముందే పూజ కూడా అయిపోతుందనీ.

ఆ దంపతులంటే దివ్యకి చాలా గౌరవం. రోజూ మధ్యాహ్నంపూట ఆయన లలితోపాఖ్యానమో, మరోటో చెప్తూంటారట. కాలనీలో ఆసక్తి వున్న ఆడవాళ్లందరూ అక్కడ చేరి వింటూ వుంటారట. ఆయన భార్యేమో ఏవో పద్యాలూ, పాటలూ నేర్పుతూ వుంటుందట. దివ్య కూడా హాజరవుతుంది వాటన్నిటికీ.



దివ్య గొప్పగా చెప్పిన వాళ్ళ దినచర్య విశేషాలు విని చిరాకుపడ్డాను నేను. "ఇలా పొద్దున్నే శబ్దం చేస్తే మనకి యిబ్బందిగా వుంటోందని చెప్పు వాళ్ళకి. ఒకసారి మెలకువ వస్తే మళ్ళీ నిద్రపట్టదు నాకు" అన్నాను దివ్యతో.

దివ్య వెళ్లి ఆయనతో ఏం చెప్పిందో తెలీదు కానీ ఆయన నవ్వి, "అయిదూ యాభైకి మెలకువ వస్తే మళ్లీ పడుకోవాలని ట్రై చేస్తున్నాడా!" అన్నాడట.

దివ్య వచ్చి ఆమాట నాతో చెప్పి ఒకటే నవ్వు. "సూర్యోదయం తర్వాత కూడా పడుకుంటే అనారోగ్యంటండీ. రాత్రిపూట కొంచెం త్వరగా పడుకుని ఆ టైంకి లేచేయండి రోజూ" అంటూ ఓ ఉచిత సలహా కూడా యిచ్చింది. నేను పెదాలు బిగించి నన్ను నేను కంట్రోల్ చేసుకోవలసి వచ్చింది.

ఒక అయిదు నిమిషాలు అలాగే ప్రక్క మీద దొర్లి, మెల్లగా లేచి బాల్కనీలోకి వచ్చాను. ప్రక్కింట్లోని జామచెట్టు పలుకరించింది.

సుబ్రహ్మణ్యశర్మగారు కాకుండా దివ్యకీ నాకూ గొడవ తెచ్చే మరో టాపిక్ ఈ జామచెట్టు. నేను బాల్కనీలోని కుర్చీలో కూర్చుని అక్కడినుంచి నిర్లక్ష్యంగా విసిరే ప్రతి కాగితమూ, కవరూ... ఈ చెట్టుకి తగిలి కింద పడుతుంది.

అది చూసినపుడల్లా దివ్య చిరాకుపడుతూ "మహానుభావా! డస్ట్‌బిన్ దాకా వెళ్ళ లేకపోతే, వాటిని కూర్చున్నచోటే నేలమీద పెట్టండి. నేను తర్వాత పారేస్తాను. అంతేకానీ అలా చెట్టుమీదకి విసరకండి. పాపం" అంటుంది.

దివ్య చెప్పే పాపాల లిస్ట్ వింటే నాకు ఆశ్చర్యమూ, చిరాకూ కూడా. "అన్నిటికీ యింత కంట్రోల్ అయితే అసలేపనీ చేయలేం తెలుసా!" అని నేను కసురుకుంటే "ఎవరు చెప్పారు? కంట్రోల్ వున్నచోటే ఎఫిషియన్సీ వుంటుంది" అంటుంది దివ్య అక్కడినుంచి వెళ్ళిపోతూ.

నేను ఆలోచనలో పడతాను. అది ఖండించడం కష్టమయిన స్టేట్‌మెంటే.

చాలా సందర్భాలలో ఈ సూత్రం నాకు ఎదురుపడకపోలేదు. అయితే నేను ఫిజిక్స్‌లోనో.. ఇంజనీరింగ్‌లోనో గమనించిన సిద్ధాంతాన్ని దివ్య అంత అలవోకగా తనే కనుక్కున్నట్లు చెప్పేయడమే నాకు ఆశ్చర్యంగా అనిపిస్తుంది.

అసలే కొరకరాని కొయ్య దివ్య. ఇంక ఈ యిల్లు కొనుక్కున్నాక శర్మగారి పుణ్యమా అని మరీ విడ్డూరమైన సిద్ధాంతాలు నేర్చుకుంటోంది. అర్థంపర్థంలేని చాదస్తాలు! ఈ కాలానికీ యిప్పటి జీవితానికీ వుపయోగపడని విషయాలు!

నేను మొహం కడుక్కునేసరికి దివ్య కాఫీ తెచ్చింది. నాకో కప్పు యిచ్చి తను మరో కప్పు తీసుకుని బాల్కనీలోని కుర్చీలో కూర్చుంది. నేను గోడమీద చేయి ఆనించి... కొద్దిగా వంగి నిలుచుని కాఫీ తాగుతూ పక్కింటి పెరడులోని చెట్లని గమనించసాగాను.

"ఏంటి చూస్తున్నారు?" అంది దివ్య వెనకనించి.

"నీ జామచెట్టు గురువుగారిని" అన్నాను నేను అల్లరిగా.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1337**

* * *

**Read other books by T. Srivalli Radhika @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=T.+Srivalli+Radhika&id=154**